ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్ 2025
5
అల్లూరి సీతారామరాజు



ఉపాధ్యాయునికి ఘన సత్కారం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని అత్యంత మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధి కర్ల పొదోర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం పాంగి లైకోన్ ఉపాధ్యాయు లుగా విధులు నిర్వహించి బదిలీల కావడంతో గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్, మాతృభాష విద్య వాలంటరీ, విద్యా కమిటీ చైర్మన్ శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుని ఉద్యోగ నియామకంలో మొదటి పోస్టింగ్ తమ గ్రామంలో వచ్చి ఉపాధ్యాయుడిగా అనేక సేవలు అందించి విద్యార్థులకు సంపూర్ణమైన విద్యాబోధన అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కె.తిలకమ్మ, చిరంజీవి, రవి, చంద్ర బాబు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

'తల్లికి వందనం'లో షరతులు సడలించాలి

- రూ.15వేల చొప్పున అందజేయాలి - ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిరసనలు



పాడేరులో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



చింతపల్లిలో నినాదాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయంలో షరతులు సడలించి అర్హులైన విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను డిమాండ్ చేశారు. శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎటువంటి ఆంక్షలు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం విధించిన షరతులను ఆనాడు విమర్శించిన కూటమి ప్రభుత్వం నేడు షరతులు పెట్టి నగదును కూడా తగ్గించడం సరికాదన్నారు. తల్లికి వందనం పథకంలో విద్యార్థికి రూ.13వేలు మాత్రమే జమ చేస్తున్నారని రూ.2వేలు స్కూలు, కాలేజీల అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. అనేక అసంబద్ధ నిబంధనల పేరుతో విద్యార్థుల సంఖ్యను కుదింపు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఫీజు రీయింబర్స్ మెంట్‌కు లింక్ పెట్టడం సరికాదని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా తల్లికి వందనం అందరికీ రూ.15 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులు జగదీష్, శ్రీను, నితిన్, చరణ్, దిలీప్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకాన్ని షరతులు లేకుండా సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం చింతపల్లి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జీవన్ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి రూ.15,000 చొప్పున వారి తల్లుల ఖాతాలో నేరుగా జమ చేయా లన్నారు. పాఠశాలల అభివద్ధి పేరుతో రూ.2,000 మినహాయించడం అన్యాయమని విమర్శించారు. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా వారందరికీ తల్లికి వందనం పథకం సమానంగా అమలు చేయాలన్నారు. తల్లుల ఖాతాల్లో పూర్తి మొత్తాన్ని జమ చేయకపోతే, మన్య ప్రాంతంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ చింతపల్లి మండల శాఖ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'లో కోతలు వద్దు : సిపిఎం

ప్రజాశక్తి-పాడేరు: గత ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి వాగ్దానం చేసినట్లుగా 'తల్లికి వందనం' నగదును అర్హులైన విద్యార్థులందరికీ నిబంధనలు సడలించి తల్లుల ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అడ్డగోలు నిబంధనలతో తల్లికి వందనం పథకం అమల్లో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందనీ ఆందోళన వెలిబుచ్చారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో 2.5 లక్షలు, పట్టణాల్లో 3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ ఖాతాల్లో తల్లికి వందనం సొమ్ము జమ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు అయిన వెంటనే వారికి కూడా నగదు చెల్లించాలని కోరారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేశారు . గ్రామ వార్డు సచివాలయాలలో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు .

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రావికమతం:అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్న అనేక రకాల వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి అన్నారు.ఈ సందర్భంగా శనివారం కవగుంట గ్రామ ఉపాధి శ్రామికులతో అనిల్ నీరుకొండ ఆసుపత్రి ప్రతినిధులు సమావేశమై ఆరోగ్యపరమైన పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అనిల్ నీరుకొండ ఆసుపత్రి బస్సులో ఆసుపత్రికి అనారోగ్యంతో బాధపడుతున్న రోగులందరిని తీసుకువెళ్లి, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. అనేక రకాల వైద్య పరీక్షలు,ఆపరేషన్లు, స్కానింగ్‌తో పాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తారన్నారు. అదేవిధంగా ఆసుపత్రికి వెళ్ళిన వారందరికీ మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ ప్రతినిధి ప్రతాప్, వి.నాగరాజు, కె .రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు : ప్రపంచ రక్త దాతల దినోత్సవం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం వి ఎస్ లోకేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం కార్ల్ లాండ్ స్టినార్ చిత్రపటానికి కమిటీ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు ప్రపంచ రక్త దాతల దినోత్సవం గూర్చి వివరించారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన కార్ల్ లాండ్ స్టినార్ 1901 లో మొట్టమొదటిసారిగా మానవ రక్తాన్ని వర్గీకరించి నోబుల్ విజేతగా నిలిచారని అన్నారు. ఆయన జయంతి నాడు జూన్ 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం గా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఆయన స్ఫూర్తితో అవగాహన కలిగి ప్రజలందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడేందుకు కషి చేయాలని పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీని అభివద్ధి చేసేందుకు సొసైటీ సభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రజలందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంచార్జి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అభిషేక్ గౌడ్ పిలుపుమేరకు సొసైటీ కార్యవర్గం నిరంతరం సేవలందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు,ప్రధాన కార్యదర్శి జి గౌరీ శంకర్, కోశాధికారి పి సూర్యారావు, వి జయలక్ష్మి, టి ప్రసాద్ నాయుడు, రవి, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ డాక్టర్ రాఘువేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



చింతపలిలలో మృతి చెందిన మూగజీవాలు

మన్యంలో భారీ వర్షం

చింతపల్లిలో పిడుగుపాటుకు గొర్రెలు, దుక్కిటెద్దు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:- ఉరుముల, మెరుపులతో కూడిన భారీ వర్షం కారణంగా జున్నుల గ్రామంలో పిడుగుపాటుకు ఐదు గొర్రెలు, ఒక దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని జున్నుల గ్రామ సమీపంలో శుక్రవారం మేత కోసం తీసుకెళ్లిన పశువులు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి గురయ్యాయి. ఈ సమయంలో పిడుగు పడటంతో గ్రామానికి చెందిన గిరిజన రైతు రాజారావుకు చెందిన ఐదు గొర్రెలు, ఒక దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనపై బాధితుడు రాజారావు స్పందిస్తూ, వీటి మృతితో తనకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.

సీలేరు :

జికె వీధి మండలం సీలేరులో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

వెళ్లే దారి లేదు..ఉండే చోటు లేదు..

- పోలవరం ముంపు గ్రామస్థుల అవస్థలు
- పూర్తికాని నిర్వాసిత కాలనీ ఇళ్లు
- వర్షాలు ఎక్కువైతే ముంపు తప్పని పరిస్థితి



నిర్వాసిత కాలనీలో పిచ్చిమొక్కలు మొలచి ఉన్న ఇళ్లు

ప్రజాశక్తి - విఆర్‌పురం: పోలవరం నిర్మాణం మాట దేవుడెరుగు, ఇప్పుడు వర్షాలు అధికంగా కురిస్తే పరిస్థితి ఏంటని ముంపు గ్రామాల వాసులు ఆందోళన చెందుతున్నారు. ముంపులో గల మొదటి కాంటూరులో ఖాళీ చేయాల్సిన ఇళ్లకు సంబంధించిన గ్రామాలు కొన్ని మాత్రమే పునరావాస ఇళ్ళ కాలనీలకు వెళ్లి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. మిగిలిన కాలనీలకు సంబంధించి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలు సుమారు 650కి పైగా నిర్వాసితులకు ఇళ్లను నిర్మిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా పనులు మధ్యలోనే అర్ధాంతరంగా కాంట్రాక్టర్లు నిలిపివేయడంతో ఎక్కడా 60 శాతం కూడా ఇళ్లు పూర్తికాక నిర్వాసితులు అయోమ యానికి గురవుతున్నారు. కుటుంబాల వారీగా కొన్ని సింగిల్ హౌసెస్, కొన్ని డబల్ హౌసెస్ అరకొరగా కొన్ని మాత్రమే పూర్తికాగా మిగతా ఇళ్లు ఇంకా పునాదుల దశలోనే ఉన్నాయి.

తాడువాయి సైట్‌లో ఇళ్లను చూస్తే పరిస్థితి తెలుస్తుంది. రానున్న మూడునెలలు కాలం తలుచుకుంటేనే నిర్వాసితుల గుండెలు జారిపోతున్నాయి. ఉందామంటే గుట్టలపై గుడారాలతో ఉండలేక పునరావాస కేంద్రాలకు వెళదామంటే ఏ ఒక్క ఇల్లూ పూర్తికాక రెండిటికి చెడ్డ రేవడిలా మారింది పరిస్థితి అని పలువురు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాటలు ప్రకటనలకే పరిమితమవుతు న్నాయి. జూన్ జూలైల్లో మొదటి కాంటూర్‌లో ఉన్న 12 గ్రామాలను తరలిస్తామని రోజుకు ప్రకటనలు చేస్తున్నారే కానీ అసలు అధికారులు సైట్‌కి వెళ్లి ఎంతవరకు ఇలా నిర్మాణం జరిగింది ఇంకా ఎంత జరగాలి ఎప్పటిలోగా పనులు వేగవంతం చేయించాలి అనే ఆలోచన లేకపోవడం గమనార్హం. పూర్తయిన ఇళ్లలో కూడా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేకున్నా చేసేది లేక ఆయా గ్రామాల నిర్వాసితులు కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి పోలవరం నిర్వాసితుల ఇళ్ల కాలనీల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ముంచుకొస్తున్న ముంపు ముప్పు



నీటమునిగిన చింతూరు సంతపాకలు (ఫైల్ ఫొటో)

చింతూరు : గోదావరి పరివాహన ప్రాంత ప్రజలకు ఈ ఏడాది కూడా ముంపు ముప్పు తప్పడం లేదు. వర్షాలు అడపా, దడపా కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి అధ్వానంగా తయారుకానుంది. రోడ్లు, మురుగు కాలువలకు సంబంధించి సమస్యలు అలాగే ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే వరదలకు మండలంలోని సోకులేరు, చీకటివాగు, కుయుగూరు, చంద్రవంక తదితర వాగుల్లో నీటి ప్రవాహం పెరిగితే పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. సోకులేరువాగు ఉప్పొంగితే విఆర్.పురం, చింతూరు రెండు మండలాల్లో సుమారు 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కుయుగూరువాగు ప్రవహిస్తే ఒడిశా, ఆంధ్ర రహదారులు మూసుకుపోతాయి. మూడు సంవత్సరాలుగా వరదల కారణంగా ఏర్పడిన రహదారి కోతలు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేయకపోవడంతో అవి అలాగే ఉన్నాయి. చింతూరు నుండి కల్లేరు వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ సారి వరదలు వస్తే గతంలో కంటే అధికంగా ప్రజలు ముంపుబారిన పడే అవకాశం ఉంది. బ్రిడ్జిలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉంటే రైతులు పంటలు వేసుకునేందుకు అవకాశం లేదు. శబరి, సీలేరు నదులు వరదల సమయంలో ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది. శబరి నది ఉధృతితో చింతూరు మండల కేంద్రంలోని పలు నివాసాలు ముంపునకు గురవుతాయి. తాగునీరు కలుషితమై వ్యాధులు ప్రబలనున్నాయి. శబరి ఒడ్డుకు వెళ్లే రహదారి లోతట్టుగా ఉండటంతో ముందుగా ముంపునకు గురవుతుంది. శబరి ఒడ్డున ఉన్న సంతపాకల ప్రజలకు ముంపు బాధలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికా రులు బోర్లలో నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. బోర్లు, బావులు క్లోరినేషన్ చేయించాలి. ముంపు ప్రాంతాల్లో ముందుగానే బ్లీచింగ్ స్టాకును ఏర్పాటు చేయాల్సి ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రు లకు తరలించేందుకు ముంపు ప్రాంతాల్లో పడవల ను ఏర్పాటు చేయాలి. గర్భిణులను ముందుగానే ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సోకులేరు వాగుపై శాశ్వత బ్రిడ్జి ఎత్తుగా నిర్మించాల్సి ఉంది.

గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లకు 17న కౌన్సెలింగ్

ప్రజాశక్తి - రంపచోడవరం : ఐటిడిఎ రంపచోడవరం చింతూరు పరిధిలోని 8 (బాలురు-4, బాలికలు-4) గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 204 సీట్లకు (బాలురు-147, బాలికలు-57) అడ్మిషన్లకు రెండో కౌన్సిలింగ్ ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ తెలిపారు. బాలికలకు గురుకుల బాలికల కళాశాల, రంపచోడవరం (ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నున్న) బాలురకు గురుకుల బాలుర కళాశాలలో, రంపచోడవరం (మారేడుమిల్లి వెళ్ళే రహదారి వద్ద నున్న) అడ్మిషన్ కౌన్సిలింగ్ ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించబడతాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని మొదట కౌన్సిలింగ్‌నకు హాజరుకాని విద్యార్థులు కూడా కౌన్సిలింగ్‌నకు హాజరు కావచ్చని తెలిపారు.

విద్యార్థులు తప్పనిసరిగా ఎస్ఎస్‌సి టి.సి, స్టడీ సర్టిఫికెట్, ఆన్లైన్ మార్కులు సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, తెల్లరేషన్‌కార్డు, విద్యార్థి ఆధార్‌కార్డు, తల్లిదండ్రులు ఆధార్ జిరాక్స్‌లు, విద్యార్థి 5 పాస్‌పోర్టు సైజ్‌ఫోటోలు, తల్లిదండ్రులు బ్యాంక్ ఖాతా వివరాలు, సర్టిఫికెట్స్ అన్ని 3సెట్ల జెరాక్స్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు కలాశాల కన్వినర్ ప్రిన్సిపాల్ రంపచోడవరంని సంప్రదించాలని ఉపసంచాలకులు యం.రుక్మాంగధయ్య తెలిపారు.

ఏరువాడలో వైద్య శిబిరం



గిరిజనులకు దాతలు అందించిన బియ్యం ఇస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - చింతూరు: తులసిపాక వైద్యులు డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, చింతూరు మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుగ్రామమైన తులసిపాక నుండి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న 7 కొండలు దాటి ఉన్న ఏరువాడలో శుక్రవారం, శనివారం రెండు రోజులు వైద్యశిబిరం నిర్వహించారు. అటవీప్రాంతంలో కొంత దూరం ట్రాక్టర్ పై వెళ్లి కొంత దూరం కాలినడకన వ్యయప్రయాసలకోర్చి ఏరువాడ గ్రామం చేరుకుని మరీ వైద్యసేవలందించారు. అక్కడ ఉన్న 25 కుటుంబాలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రతి ఇంటికి మలేరియా నివారణకు ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులపై జాగ్రత్తలు చెప్పారు. పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు శుభ్రతపై విద్యా మార్గదర్శనం చేశారు. 25 కుటుంబాల్లో వందమందికి మలేరియా జ్వరాలు అంటువ్యాధులకు చికిత్స చేసి, మందులు అందించారు. దాతల సహకారంతో కొండరెడ్లకు దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. ఏరువాడలో జరిగిన ఆరు పెళ్లిళ్లకు డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైద్యసిబ్బంది ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగరాజు, హెల్త్‌అసిస్టెంట్ అంజిబాబు, ఫార్మాసిస్ట్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ ధర్మా, శివుడు (ఎన్ఎన్ఓ), ఆశవర్కర్లు సుశీల, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టడం విచారకరం

ప్రజాశక్తి - సీలేరు: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ 15వ ఆర్థికసంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించడం విచారకరమని జికె వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ సర్పంచ్ పాంగి దుర్జో పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జికె వీధి మండలంలోని 11 పంచాయతీల్లో నిధులు కొరత కావడంతో క్లాప్‌మిత్ర సభ్యులకు వేతనా లు చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ మేరకు మండల పరిధిలో ఉన్న 11 పంచా యతీల సర్పంచులు శుక్రవారం చలోపాడేరు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసామన్నారు. పంచాయతీ నిధులు తక్షణమే ఖాతాల్లో జమ చేసే విధంగా అధికారులు ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరామన్నారు. పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్ కలెక్టరు అందుబాటులో లేకపోవడంతో ఆర్‌డిఒకి వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ చేయకపోతే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జోరుగా రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి - చింతూరు: రోడ్ల విస్తరణలో భాగంగా గత రెండు రోజుల నుండి మండల కేంద్రంలోని ఎర్రంపేట నుండి బ్రిడ్జి రోడ్డు వరకు దుకాణదారులకు ముందస్తుగా అధికారులు నోటీసులు ఇచ్చి రెండు రోజుల నుండి పనులను ముమ్మర చేశారు. ఎర్రంపేట నుండి చింతూరు మీదుగా చట్టి జాతీయ రహదారి వరకూ తొలగింపులు చేపట్టారు.



రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న దృశ్యం

సబ్సిడీ వరి విత్తనాలు అందించండి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: మండలంలోని రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించిన నేపథ్యంలో సబ్సిడిపై వరి విత్తనాలు ప్రభుత్వం తక్షణం పంపిణీ చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొంచెం జగన్నాథం కోండ్ల సూరిబాబు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి విత్తనాలు అందిస్తే ముందుగానే నారుమళ్లు పోసుకునే అవకాశంఉంటుందన్నారు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని అప్పన్నపాలెం గ్రామానికి చెందిన ఎం.భీమరాజు శనివారం మృతి చెందినట్లు రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు. మూడు రోజుల కిందట రాజవొమ్మంగి నుండి భీమరాజు తన స్వగ్రామం వెళుతుండగా మండలంలోని సూరంపాలెం సమీపంలో బైకు అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దళిత రాజీవ్‌మాన్ పిహెచ్‌సికి తరలించ మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అనంతగిరి: జూలై నెల 9వ తేదీన జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం గిరిజన సంఘం కార్యాలయంలో మండల సిఐటియు మహాసభలు గెమ్మెల దేవన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా తల్లికి వందనం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు పదకొండు వేల ఆయిదు వందల రూపాయలు గౌరవ వేతనం వస్తుందని ప్రభుత్వం 12 వేల రూపాయలు నిబంధనలు పెట్టిందని నిబంధనల ప్రకారం అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా వర్తింపజేయాలని కోరారు. రాష్ట్ర కేబినెట్ లో పని గంటలు 10 గంటలకు పెంచాలని తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి జెడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు, గిరిజన సంఘం నాయకులు సోమెల నాగులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కళావతి, మంజుల, సుమిత్ర ,చిలకమ్మ పాల్గొన్నారు.

తల్లికి వందనం నగదు తీసుకునేందుకు
గిరిజనుల అవస్థలు


బారులు తీరిన గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలు రెండవ శనివారం సందర్భంగా మూతపడటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా తల్లికి వందనం పథకం కింద శుక్రవారం ఖాతాల్లో జమ అయిన డబ్బులు తీసుకోవడానికి శనివారం సంత కోసం వచ్చిన వందలాది మంది మహిళలు నగదు నిరాశతో వెనుదిరిగారు.బ్యాంక్ ఆఫ్ బరోడా విత్‌డ్రాల్స్ కోసం బ్యాంక్ మిత్రుల ద్వారా సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసినా మిత్రుల సంఖ్య తక్కువగా ఉండటంతో సేవలు సరిపోలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు, స్థానికులతో కలసి పెద్ద సంఖ్యలో బ్యాంక్ మిత్రల వద్ద బారులు తీరారు.శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏకధాటిగా కురిసిన వర్షం ప్రజలు భవనాల ఛాయల్లో తల దాచుకోవాల్సి వచ్చింది. సాయంత్రం నాలుగు గంటలకు వర్షం తగ్గినప్పటికీ బ్యాంక్ మిత్ర సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు నిరాశతో వెనుదిరిగారు.

హైకోర్టు ఆదేశాల ప్రకారం
100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలి

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు నిరసన


రోడ్డుపై బైఠాయించి నిరసన చేపడుతున్న ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా 5వ షెడ్యూల్ ప్రాంతంలోని పలు ప్రధాన కేంద్రాల్లో రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకిరువైపులు 50 అడుగుల చొప్పున ఆక్రమణలు తొలగించి 100 అడుగుల వెడల్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు అమలు చేయాలన్నారు.100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు ఆగకుండా జరగాలని పాడేరు కేంద్రంలో శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు నాయకులు, ప్రజా సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయింపు జరిపారు. ఆయనతోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు వైసిపి నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత వాసులు జిల్లా కేంద్రంతో పాటు మరియు ప్రధాన కేంద్రాల్లో రహదారుల అభివృద్ధి కోరుకుంటున్నారన్నారు, అదే మాదిరిగా ఇరువైపులు రోడ్డు వెడల్పు చేస్తే భవిష్యత్ తరాలకు ట్రాఫిక్ మరియు అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ఉంటుందని అన్నారు, కూటమి నాయకులు ఎన్ని ఒత్తిళ్లు గురిచేసిన కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణ పనులు యధావిధిగా జరగాలన్నారు, లేదంటే దీనిపై మరింత పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించి ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, ఎంపీటీసీ లకే రామకృష్ణ పాత్రుడు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, కాడెలి సర్పంచ్ వనుగు బసవన్న దొర, మాజీ సర్పంచులు మినుముల కన్న పాత్రుడు, శరభ సూర్యనారాయణ, నాయకులు కూడా సుబ్రమణ్యం, యువత తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు విద్యుత్ బిల్లుల షాక్!

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో విద్యుత్ బిల్లుల షాక్‌తో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. నెలసరి వచ్చే మామూలు బిల్లుల కంటే ఇరవై, ముప్పై రెట్లు అధిక మొత్తంలో ఈ నెల బిల్లు రావడంతో తేరుకోలేని పరిస్థితి ఉంది. కొన్నాళ్లుగా పెరిగిన బిల్లులను చెల్లించలేక సతమతమౌతున్న వారంతా తాజాగా వచ్చిన బిల్లులను చూసి బిగుసుకుపోయే పరిస్థితి ఉంది. జగన్నాథపురానికి చెందిన మతికాన సన్యాసమ్మ వినియోగదారులకు ఎపుడూ నెలసరి రూ.300లోపే విద్యుత్ బిల్లు వచ్చేది. గతనెలలోనూ. రూ.300బిల్లురాగా, ఈనెలలో ఏకంగా రూ.6,719 బిల్లు రావడంతో మాటరాని పరిస్థితి నెలకొంది. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆకుటుంబం, మామూలు బిల్లులను చెల్లించడమే భారంగా ఉందని భావిస్తున్న నేపథ్యంలో ఈ భారీ బిల్లు ఎలా చెల్లించాలని ఆవేదన చెందుతోంది. అదేగ్రామానికి చెందిన అదే గ్రామానికి చెందిన బంక శ్రీను, పాండ్రంకి శ్రీరామ్ ప్రసాద్, ఇలా మరికొందరు వినియోగదారులకు కూడా కళ్లు తిరిగిపోయేలా అధికబిల్లులు వచ్చాయని అంటున్నారు. దీనిపై బిల్లులను పట్టుకుని వెళ్లి స్థానిక విద్యుత్ శాఖ అధికారులను సంప్రదిస్తే, ముందుగా బిల్లు మొత్తం చెల్లించాలని, అనంతరం మీటరును పరిశీలించి సమస్య ఉంటే పరిష్కరిస్తామని చెప్పడంతో ఏంచేయాలో పాలుపోక సతమతమౌతున్నారు. దీనిపై విద్యుత్ ఎఇఇ అప్పలనాయుడు వివరణ కోరగా, వచ్చిన బిల్లు ముందుగా చెల్లించాలని, లేకుంటే గడువుదాటితే నిబంధనల మేరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. తర్వాత పరిశీలించి సాంకేతిక లోపముంటే సరిచేస్తామన్నారు. కాగా కూటమి పాలనలో విద్యుత్ బిల్లుల భారం ఉండబోదని ముందుగా ప్రకటించి, కొన్నాళ్లుగా అధిక బిల్లులు వడ్డిస్తుండగా, ఇపుడు అనూహ్య బిల్లులను చూసి వినియోగదారులు ఖిన్నులౌతున్నారు.



సన్యాసమ్మకు వచ్చిన బిల్లు,

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవల్ వైద్యుల దుర్మరణం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని కాన్వెంట్ జంక్షన్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవల్ ఆసుపత్రి వైద్యులు దుర్మరణం పాలయ్యారు. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు మల్కాపురం పరిధిలోని సింధియా వద్ద గల కల్యాణి నేవల్ ఆసుపత్రిలో లెఫ్టినెంట్ హోదాలో మేఘా రావత్(24), సౌమ్య సతీష్ (25) వైద్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో షీలా నగర్ నుండి ఎస్సార్ జంక్షన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్ వైపు ద్విచక్ర వాహనంపై ఇద్దరూ బయలుదేరారు .సతీష్ డ్రైవింగ్ చేస్తుండగా, బైక్ వెనక మేఘ రావత్ కూర్చొని ఉన్నారు. సరిగ్గా ఎస్సార్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ వైపు కటింగ్ అవుతుండగా అదే మార్గంలో వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ను తప్పించబోయి అదుపుతప్పి ద్విచక్ర వాహనంతో పాటు వైద్యులిద్దరూ కింద పడిపోయారు. వారిద్దరి పైనుంచి ట్యాంకర్ దూసుకుపోవడంతో వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే ఇద్దరు చనిపోయారు. దుర్ఘటనలో గుర్తుపట్టని విధంగా వారి తల భాగం నుజ్జునుజ్జు కావడం, రక్తంతో శరీర భాగాలు రోడ్డుపై పడి ఉండడం చూపురులను కలిచి వేసింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి కెజిహెచ్ మార్చురీకి తరలించారు .

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ


ఘాట్‌రోడ్డులో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి-అరకు మలుపుల ఘాట్ రోడ్డులో ప్రయాణం వాహనదారులకు గంటల తరబడి ఆలస్యం అవుతోంది. శనివారం రెండో నెంబర్ మలుపు సమీపము వద్ద ఎదురుగా వచ్చిన వాహనాలతో తప్పించుకునేందుకు గంటల తరబడి ఆలస్యం నెలకొంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి పనులు అనంతగిరి మండలం వెంకయ్యపాలెం ఘాట్ రోడ్డు మొదలుకొని డుముకు, అనంతగిరి, బీసుపురం, అరకు మండలం బోసుబెడ్డ వరకు పనులు నేటి వరకు మొదలుపెట్టిన దాఖలాలు లేవు. ఈ ఘాట్ రోడ్డు మార్గాన 12 నుండి 18 చక్రాల లారీలు నిత్యం తిరుగుతాయి. గతంలో సిమెంట్ లోడుతో వెళుతున్న 18 చక్రాల లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో రాకపోకల వాహనాలు నిలిచిపోయిన సంఘటన ఉన్నాయి. ఎయిర్ పిన్ బెండ్ ఒకటి నుండి సుమారు 15 పైగా మలుపులు కూడిన ఘాట్ రోడ్డు కావడంతో పర్యాటక ప్రాంతాలు తిలకించేందుకు వచ్చే వారి వాహనాలు రోజురోజుకు నిత్యం రద్దీగా ఉంటుంది.

అంతేకాకుండా ఈ ఘాట్ రోడ్డు లో ప్రమాదాలు కూడా అంతే సంభవిస్తున్నాయి ఇప్పటికైనా సరే జాతీయ రహదారి పనులు పున్ణర ప్రారంభించాలని పలువురు వాహన సోదకులు స్థానిక ప్రజలు కోరుతున్నారు

17న ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సదస్సు

ప్రజాశక్తి -తగరపువలస :ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న విశాఖ ఎన్ఎడి కొత్తరోడ్డు జంక్షన్ దరి ఆహ్వాన కల్యాణ మండపంలో నిర్వహించే పెన్షనర్ల ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని చిట్టివలస ప్రాంత ఎంప్లాయీస్ ప్రావిడెంట్‌ఫండ్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కానూరు రాంబాబు, దామోదర బాబాజీ. సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, తెలిపారు. శనివారం . చిట్టివలస లేబర్‌వెల్ఫేర్ సెంటర్‌లో జ్యూట్‌మిల్లు పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బాబాజీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ హయ్యర్ పింఛను పొందే అవకాశం కల్పించాలన్నారు. కనీస పింఛను రూ.9 వేలు ఇస్తూ, డిఎ అనుసంధానించాలన్నారు. పెన్షనర్ల దంపతులకు వైద్య సదుపాయం, రైల్వే రాయితీ పునరుద్ధరించాలని కోరారు. ఇపిఎస్ 95 పెన్షనర్లందరికీ రేషన్ కార్డులు, ఎన్‌టిఆర్ వైద్యసేవ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు వివిధ రూపాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఐక్యంగా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమౌతాయన్నారు.

విశాఖలో సదరన్ సినర్జీ ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ చైర్మన్ ఆర్. సురేష్‌కుమార్ బండారు నాయకత్వంలో నిర్వహిస్తున్న డిజైన్, ఆర్కిటెక్చర్ కాన్‌క్లేవ్, సదరన్ సినర్జీ 2025ను విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ శనివారం ప్రారంభించారు. మధురవాడలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో శ్రీభరత్ మాట్లాడుతూ, డిజైన్ కమ్యూనిటీని ఏకతాటిపైకి తీసుకురావడంలోనూ, సృజనాత్మక, నిర్మాణ ఆవిష్కరణలకు పెరుగుతున్న కేంద్రంగా విశాఖను హైలైట్ చేయడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. నిర్వాహకులు ఆర్. సురేష్‌కుమార్ బండారు మాట్లాడుతూ ఆదివారం వరకు ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నిర్వహించే ప్రదర్శనకు ప్రవేశం ఉచితమన్నారు. ఈ ఎక్స్‌పోలో 300 క్యూరేటెడ్ ఇంటీరియర్ డిజైన్ ఆర్కిటెక్చరల్ ప్రొడక్ట్ స్టాల్స్, ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, విద్యార్థుల డిజైన్ షోకేస్‌లు ఉన్నాయన్నారు. సినర్జీలో హైదరాబాద్, బెంగళూరు, కేరళ, కోయంబత్తూర్, గోవా భువనేశ్వర్‌లతో సహా దక్షిణ ప్రాంతం అంతటా 250 మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు డిజైన్ నిపుణులు పాల్గొంటారన్నారు.

నేడు జయహో శ్రీశ్రీ సాంస్కృతిక కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటి ఆధ్వర్యంలో జయహో శ్రీశ్రీ పేరుతో సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటి ఒక ప్రకటనలో పేర్కొంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, నాలుగోఫ్లోర్ బిగ్ మినీ హాల్లో కార్యక్రమం ఉంటుందని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి తెలిపారు.

16 నుంచి ఇసుజు ఐ కేర్ మాన్సూన్ సర్వీస్ క్యాంపులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఉత్తమ సర్వీస్, అందించాలనే ఇసుజు ప్రయత్నాలలో భాగంగా , ఇసుజు మోటార్స్ ఇండియా తన ఎస్?యూవి వాహనాల కోసం దేశవ్యాప్తంగా 'ఇసుజు ఐ-కేర్ మాన్సూన్ క్యాంప్' ను ఈ నెల 16 నుండి ప్రారంభిస్తుందని సంస్థ ప్రతినిధి సందీప్ తెలిపారు. వర్షాకాలంలో సమస్య రహితమైన డ్రైవింగ్ కొరకు నిర్వహణ చెక్సను అందించాలనే లక్ష్యంతో ప్రారంభించామన్నారు. ఈ మాన్సూన్ క్యాంప్ అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్స్‌లో జూన్ 16 నుంచి 21వరకు ఏర్పాటు చేయబడుతుంద న్నారు. ఈ సమయంలో వినియోగదారులు వారి వాహనాల కోసం ప్రత్యేక అఫర్లు ప్రయోజనాలను అందుకోవచ్చన్నారు. లేదా https://www.isuzu.in/servicebooking.htmlను సందర్శించవచ్చు అని, మరింత సమాచారం కోసం వినియోగదారులు 1800 4199 188 (టోల్-ఫ్రీ) పై సంప్రదించవచ్చు అని తెలిపారు.


ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

'తల్లికి వందనం'లో లక్షకుపైగా అనర్హులా..?

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతల హామీ ఇచ్చి, లక్షమందికి పైగా అనర్హులు చేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ విమర్శించారు. శనివారం ఆసీలుమెట్ట కార్యాలయంలో 39వ వార్డు పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన రెహానా భాష (12) స్కూల్ ఫీజుకి వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం హడావిడిగా ప్రారంభించి లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత విధించారన్నారు. కార్యక్రమంలో 39వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, పార్టీ సీనియర్ నాయకులు దశమంతుల మాణిక్యాలరావు పాల్గొన్నారు.

మద్దిలపాలెం బస్‌స్టేషన్‌లో యోగాంధ్ర క్యూఆర్ కోడ్‌లు


క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఆర్టిసి రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అందులో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్లను విశాఖపట్నం ఆర్టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు శనివారం మద్దిలపాలెం బస్‌స్టేషన్లో అతికించారు. అనంతరం అక్కడ ఉన్న ప్రయాణికులకు సిబ్బందికి క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ ఎలా చేయాలో వివరించి పలువురికి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా వేడుకలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇతర ప్రాంతాల నుండి ఆర్టిసి బస్సులను రప్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, మద్దిలపాలెం స్టేషన్ యూనిట్ ఇన్‌చార్జి మూర్తి, సూపర్‌వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

రూ. 3.5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర అభివద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అదే లక్ష్యంతో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శనివారం దక్షిణ నియోజకవర్గంలో సుమారు రూ.3.58 కోట్ల జివిఎంసి నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులకు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు సి.హెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపనలను, ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నగరంలో గల అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులను ప్రజలకు కల్పించేందుకు జివిఎంసి ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. శనివారం దక్షిణ పరిధిలోని 34,36,37,38 వార్డులలోని గొల్లలపాలెం, చాకలిగెడ్డ , బొమ్మన బ్యాక్‌సైడ్, గంగులగెడ్డ ,భూపేష్ నగర్,నాయుడమ్మ ఫంక్షన్ హాల్ రోడ్డు, అల్లిపురం ఎస్సీ కాలనీరోడ్ ,బౌడరా రోడ్డు కొబ్బరితోట, మంతావారి వీధి మార్కెట్ మెయిన్‌రోడ్, రంగిరీజువీధి, సున్నపు వీధి, పంజా జంక్షన్, కనకమహాలక్ష్మి టెంపుల్, గోసాల ఆసుపత్రి, కొత్తఅగ్రహారం, కొత్తజాలారిపేట, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో రూ.357.08 లక్షల వెచ్చించి రోడ్లు, సిమెంట్ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణాలు, మరమ్మతులు, బోర్లు, పార్కుల పునరుద్ధరణ, కాంపౌండ్ వాల్స్ ఆర్చ్‌లు తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించి సంబంధిత గుత్తేదారులు నిర్ణీత సమయంలో నాణ్యతతో కూడిన పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులను మేయర్ ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులను గుర్తించి అభివద్ధి చేస్తున్నామని, నియోజకవర్గంలో అన్ని వార్డులను అభివద్ధి చేసేందుకు గాను ఈరోజు పలు అభివద్ధి పనులను మంజూరు చేసి ప్రారంభోత్సవాలను శంకుస్థాపనను చేసిన నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశాఖ అభివద్ధికి కంకణం కట్టుకుందని, విశాఖ జిల్లాను దేశంలోనే గుర్తింపు పొందే విధంగా తీర్చిదిద్దేందుకు, ప్రతిఒక్కరికి సంక్షేమంతో పాటు మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, మహా విశాఖ నగరపాలక సంస్థ కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేనఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి ,ఆయా వార్డు కార్పొరేటర్లు, బిపిన్ జైన్ కుమార్ జైన్, ఎం.మేరీ జోన్స్,చెన్నా జానకి రామ్, గోడే విజయలక్ష్మి, 4 వ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు కార్యనిర్వహక ఇంజనీరు యు.ఎన్.నరసింగరావు, ఉప కార్య నిర్వాహక ఇంజనీరు వెంకటేశ్వరరావు, ఎఎంఒ హెచ్ పలువురు కార్యకర్తలు,నాయకులు, పాల్గొన్నారు.

యోగాంధ్రలో అంతా భాగస్వాములు కావాలి

సమాచారం ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు
విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న నగరంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి పాల్గొనే యోగా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయా సంస్థల నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు, విద్యా సంస్థల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. నగరంలోని కేంద్ర ప్రభుత్వ, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో యోగాంధ్రపై కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తమ సంస్థల తరపున యోగా దినోత్సవంలో ఎందరు, ఏయే ప్రదేశాల్లో పాల్గొంటారనే సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి అందజేయాలని కోరారు. అన్ని కేంద్రసంస్థలు, పరిశ్రమలు తమ పరిధిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. తమ సంస్థల ఆవరణలో అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో యోగ నిర్వహిస్తున్నామని పోర్టు ట్రస్టు, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, కోరమాండల్, దివీస్, ఐఐఎం,రైల్వే ప్రతినిధులు తెలిపారు. యోగా దినోత్సవంలో పాల్గొనే వారందరికీ టీ షర్టులు, మేట్‌లు జిల్లా యంత్రాంగం తరపున అందజేస్తామని చెప్పారు. యోగలో పాల్గొనదలచిన వారికి అవసరమైన సమాచారం అందజేసేందుకు సాగరిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై సమాచారం కోసం ఈ హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. 0891-2942015, 2942040, 2942044, 2942055 ల్యాండ్ లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే సమాచారం అందజేస్తారని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు

టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.ప్రణవ్ గోపాల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: గడిచిన ఏడాది కాలంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ప్రణవ్ గోపాల్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తల్లికి వందనం అనుకున్న మాట ప్రకారం అమలు చేశామని ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ ఇవ్వడం జరిగిందన్నారు. కానీ దీనిని కూడా వైసిపి విష ప్రచారం చేస్తోందని 2 వేలు తగ్గించామని తప్పుడు ప్రచారం చేసి మంత్రి నారాలోకేష్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పాఠశాల నిర్వహణకు ఈ నగదు మినహాయిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఇచ్చే కిట్స్‌పై గతంలోలాగ ఎక్కడా కూడా నాయకుల ఫోటోలు, పేర్లు తాము ముద్రించలేదన్నారు.


క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విశాఖ క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగాయి. రెండేళ్ల పాటు కొనసాగే నూతన కమిటీ అధ్యక్షునిగా దాడి రవి కుమార్, కార్యదర్శిగా ఎబిఎన్ సతీష్, ఉపాధ్యక్షులుగా బండి శివరామకృష్ణ (ఎఎన్ఐ), గిరి (ఎస్‌డివి), సంయుక్త కార్యదర్శులుగా నల్లా రాము (టైమ్స్ ఆఫ్ ఇండియా), ఎ.నరేష్ (సాక్షి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.భానోజీ (ఇండియా టుడే), కోశాధికారిగా పి.వాసు (హేన్స్ ఇండియా) కార్యవర్గ సభ్యులుగా సనపల చినబాబు (విజయభాను), గురుగు బిల్లా శ్రీనివాసరావు (ఆంధ్రప్రభ), కె.విజయ్‌కుమార్ (లీడర్), భాగ్యరాజ్ (ప్రజాశక్తి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎస్.ఆర్.ప్రసాద్ ఎన్నికయ్యారు.

సమాచార శాఖ ఉప సంచాలకులుగా రమేష్

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణం ఉప సంచాలకులుగా డి.రమేష్ బాధ్యతలు (ఎఫ్ఎసి) స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ విజయనగరంలో ఎడిగా సేవలందిం చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విశాఖపట్టణంలోని ఎస్ఐసి (రాష్ట్ర సమాచార కేంద్రం) ఎడిగా విచ్చేసిన ఆయన విశాఖపట్టణం సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఉపసంచాలకులుగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌లను వారి ఛాంబర్లలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సమాచారపౌర సంబంధాలశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్‌ను కూడా కలిశారు. రమేష్ నియామకం పట్ల సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.వి.రమణ అనకాపల్లి బదిలీపై వెళ్లారు.

నీట్ ఫలితాల్లో విజయకేతనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శనివారం విడుదలైన నీట్ - 2025 ఫలితాల్లో విశాఖ విద్యార్థులు మెరిశారు. నగరంలోని ఎసెంట్ సంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ముప్పారపు తులసి భార్గవ రామ్ జాతీయ స్థాయిలో రిజర్వుడ్ కేటగిరీలో 55వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 211వ ర్యాంకు సాధించాడు. ఆ కళాశాల విద్యార్థులు వరుసుగా 402, 905, 1582, 1742, 1782, 2171, 2190, 2742, 2956 వంటి ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి ఉత్తమ ఫలితాలు పొందారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎంవిఆర్.మురళీకృష్ణ మాట్లాడుతూ మొట్టమొదటి బ్యాచ్‌లోనే ఎక్కువ ర్యాంకులు సాధించగలిగామన్నారు. ఒకే ఒక క్యాంపస్ నుండి నీట్ 2025లో 100 మంది సీట్లు సాధించారని తెలిపారు. దీని వెనక ఉన్న తమ డైరెక్టర్‌లను, అధ్యాపక అధ్యాపకేతర బృందాన్ని, వారి పట్టుదల, కృషిని ఆయన అభినందించారు.

జిల్లాలోని శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తరాంధ్రలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీలకు చెందిన జి.గురు చరణ్ 207, జామ గిరిజ 425, డి.అజయ్ 1865, ఎం.లక్ష్మీరాజు 2228, ఎస్.హర్షవర్ధన్ 2856, డి.వివేక్ 3260, టి.కావ్య ప్రవళిక 5180 ర్యాంకులు సాధించారు. సాధారణ విద్యార్థులతో శ్రీ విశ్వ కళాశాల అసాధారణ ఫలితాలు సాధించిందని, 1000లోపు ఇద్దరు, 5000లోపు 8 మంది, 10000లోపు 16 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని, మొత్తం 131 మంది విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు తెచ్చుకోవడం విశేషమని శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు తెలిపారు ఈ సందర్భంగా ఈ ఘనత సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ విశ్వ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు